కథానిక :

# మేనరికపు విభ్రాంతి

★ శ్రీ కవికొండల వేంకటరావుగారు.

రాజానందుడికి మేనమామ కూతురు వొకామెవుంది. రాజానందుడంటే ఎవరో తరువాత చెప్తాను. ముందు రాజానందుడు అనే పేరు మాత్రం జ్ఞాపకంవుంచుకొంటే చాలు పాఠకులు—ఆలాంటి వాళ్లు కొంతమంది వుంటారు ఈ ప్రపంచంలో—వాళ్ల నామధేయాల్ని బట్టి మనస్థగితపు రాయళ్లు అయిపోయేవాళ్లు.

ఆ మేనమామకూతురొనాడు అతణ్ణి ప్రశ్నమీద ప్రశ్న వేసింది. "నాచీరెల్లావుంది బావా!" అని. రాజానందుడు "బావుంది" అన్నాడు. "నా రూపురేఖలో?" రాజానందుడు "నాకేంలోపం కనిపించడం లేదు." అన్నాడు. "నా కంఠస్వనమో?" అని అడిగింది. "కిన్నెర మీదకిన్నెరనెక్కించి పాడించి నట్టుగావుంది" అన్నాడు. "నాఫోటోవో?" అంది ఓఫోటో రాజానందుడి చేతికందిస్తూ. రాజానందుడు ఫోటో చూడకుండగానే "నల్లగావుంది" అన్నాడు. "లేదులే! నల్లగా లేదులే. పప్పులో కాలేశావు! వేశావు!—" అనిగంతు లేసింది-పదహారేళ్ల ఆ పిల్లా ఎనిమిదేళ్ల బాలికలా. ఆపాళంగా రాజానందుడు "ఉడుకుడుకుపప్పా? పాకుడు కట్టినపప్పా?" అంటూ ఒక కాలు తెగ్గాలినట్టు, ఒకకాలు జారి పోయినట్టు ఏకకాలమందే అభినయించిన వాడై, పెద్దడ్యాన్సు ప్రదర్శించాడు.

ఆ డ్యాన్సుతో చేతిలోవున్న ఫోటో క్రిందపడి అద్దం పగిలిపెంకులు చెల్లాచెదరయి పోయాయి, ఆ పడుచు డ్రాయింగు రూమ్ నిండా. కాని ఫోటో ఫోటో బొరుసుగాకాకుండా బొమ్మగా రాజానందుని కళ్లముందు వెల్లడి అవుతూ త్రివర్ణ చిత్రంగా వెలిసింది. "మూడు రంగుల్లా?" "ఊ త్రైకలర్డదే! పైకెత్తేదేమిటిలే దాన్నిప్పుడు. తరువాత నే నెత్తుకుంటాను. నీ చేతిలో అద్దపెంకులు గ్రుచ్చుకున్నా నానా రంగులూ అవుతుంది"

"నా నెత్తురంటే నీ కంతచులకనా? నా నెత్తురు ఆ బొమ్మకంటుకుంటే అది బ్లడీపిక్చర్ అయి పోతుందనే నీ భయం? నా బ్లడ్! బ్లడ్! ఈ బొమ్మకు తగిల్తే ఈ బొమ్మకే కాకుండా ఈ బొమ్మ యొక్క అసలుక్కూడా ఫోర్ డైమెన్షన్సు చూపిస్తుంది."

"దీని అసలు నెగిటివ్"

"నెగిటివ్‌కు ఆధార భూతమైంది. ఆదిది. ఇది! ఈ బుగ్గ! ఇదికాదు ఈ బుగ్గ"! అంటూ ఆ మేనమామకూతురు యొక్క రెండు బుగ్గలూ...

కొఱకలేదు! నులమ లేదు. తుదకుముద్దైనా పెట్టుకో లేదు. ఆమె ఆలాచెంగున తప్పుకొంది. మిక్కిలి నేర్పుగా తప్పుకుంది. ఎక్కడి గాజుపెంకు లక్కడేవున్నాయి. ఎక్కడి బొమ్మ అక్కడేవుంది. ఎక్కడి రాజానందుడక్కడే వున్నాడు. ఆమె మాత్రం "అమ్మోయి" ఒసేవ్! ఓ అమ్మా, బావకు ఎన్నడూకాని మహా పరాభవమైందేవ్! ఈ వేళ ఎన్నడూ కాని మహా పరాభమైం దేవ్!" అంటూ నట్టింటిలోగ్గంతి కేకేసింది పెంకులెగిరేటట్టు.

పిల్ల యొక్క తల్లి రాజానందుడికి మేనమామ భార్య. మేనత్తకాదు. అంచేత ఆమె ఏమీ కలగజేసి కోక మగనితో "చూడండీ! మీ మేనల్లుడికే మీటోపరాభవమైందట" అంది. రాజానందుడి మేనమామ వెంటనే ఆమెకెదురు తిరిగినట్టు "పరాభవం మనకా వాడికా?" అని సవాలే శాడు. మఱి మాటకు మాట తనతల్లి అందుకోకుండానే కూతురు "బావకేనండీ! బాబయ్యగారూ! ఇలారండీ! ఇలావచ్చి ఈ గదిలో చూడండి! స్తంభంలా ఏలా నిలుచుండి పోయాడో!" అని రాజానందుణ్ణి, మనస్తబ్ధ, వాక్‌స్తబ్ధ, కర్మస్తబ్ధ విగ్రహునిగా తండ్రిక్కాపటిచింది. తండ్రి రాజానందుణ్ణి పలకరించ కుండానే నేల మీదను వున్న ఫోటో చూస్తూ పైకెత్తి "ఇలాంటి ఫోటో ఎప్పుడు తీయించుకున్నావే? అని అడిగాడు. కూతురు "తీయించుకొన్నాను లేండి! తీయించుకున్నాను లెండి" అని నసికింది. రాజానందుడు "మామయ్యా! నీకు తెలియకుండా, ఈ ఫోటో ఎందుకు తీయించుకున్నావు అని నే నడి

గితే—కోపంవచ్చి-నీ కూతురు నేల నేసి ఆ ఫోటోకొట్టి-నన్ను పరాభవించానని మీ అందరితోనూ కోస్తూవుంది" అన్నాడు. ఆడపిల్ల వెంటనే "మగాళ్లెంతకైనా సమర్థులు! అంతలో అల్లేస్తారు" అంది.

రాజానందుడు "నేనన్నది కల్లా ?"

పిల్ల "కాదు! కల!"

పిల్ల తండ్రి వాళ్లయిద్దరి సంభాషణావింటూ నిర్విణ్ణుడై పోతున్నాడు.—పిల్లతల్లివుండే ఆమహాయిల్లాలు, గోడ చాటునున్నదల్లా, ఓ చీపురుకట్ట పుచ్చుకుని గదిలోకి ప్రవేశిస్తూ—"మీరు ముగ్గురూకూడా ముందు సావిట్లోకి వెళ్లి నిలబండడి. ఇప్పుడు గాజు పెంకులు ఎవరికి గ్రుచ్చుకున్నా ప్రమాదమే. తుడిచి పారపోసేస్తాను." అంది. తక్షణం ఆమె ఆజ్ఞవినక పోతే ఆ ముగ్గురి పనీ ఏమైవుండేదో—

ముగ్గురూ చావడిలోకి తప్పుకున్నారు. ఆమె రుసరుసలాడుతూ కొన్ని పెంకులు చిట్టివి చిల్లరివి-చీపురులోనే దూరి పోయితొంగి మెఱసి పోయేలా, గది అంతా శుభ్రంగాతుడిచి అవలకు చీపురు మీదనే తీసికొని వెళ్ల వీధిలో దూరంగా పారబోసి ఇంట్లోకి వచ్చి వేసింది.

అంత పనీ చేసి తల్లి తిరిగి ఇంట్లో ప్రవేశించే సరికి రాజానందుడి మేనమామ "ఈ ఫోటోలు ఇవీ ఈలా తీయించుకోవడం వట్టి భేషజం బిడ్డా. అసలు ఈ వయస్సే నిలబడదు!" అన్నాడు పాఠంవతుగా కూతురితో. రాజానందుడు "కాబట్టే ఫోటోలు."

మేనమామ "ఫోటోకి రంగులు ?" రాజానందుడి మేనమామ యొక్క-భార్య "మఱిగులాబి రంగు చెక్కిళ్లున్న వాళ్ల ఫోటోలు ఎలాపడతాయి ఆలాగాక" అంది. పునః చూస్తూ. "ఓసి! ఇదినీ చిన్నప్పటి ఫోటోటే? నా తెలివిగాల" అన్నాడు పండు వెంద్రుకల గేస్తుడు. మగని చేతిలోని ఛాయా చిత్రం ఆ వెంటనే భార్యకూడా చూస్తూ "నా బుగ్గలకీ రంగు లుండడం నే నెప్పుడూ ఈ వఱకెఱుగనుసుమండీ! ఏది ఫోటో ?" అని ఆ ఫోటో అరచేతిలోకి తీసికొంటూ మఱీమఱీ చూసుకొంటూ విస్తుపోయింది.

రాజానందుడు "మీకు లేక పోయినా మీ అమ్మాయి కున్నాయి కాదండీ!"

తల్లి "మా అమ్మాయివట్టి వెఱ్ఱి పిల్ల!—రేపట్నుంచి నా ఫోటోకే కాకుండా నా మొహానికూడా రంగులు పులుము తావా ఏమిటి?" అని తాను కొత్తగట్టించుకున్న పళ్ల నిల్పు నల్పంగానవ్వుతూ కూతుర్ని ప్రశ్నించింది. రాజానందుడు "మీ అమ్మాయి గడుసుదే! నేనే వెఱ్ఱివాణ్ణి. ఆ ఫోటో మీదో మీ అమ్మాయిదో గుర్తించ లేక పోయాను." అని అవనతముఖు డయ్యాడు.

మేనమఱదలు "బావా! ఇప్పటికైనా నీ విభ్రాంతి వదలి పోయిందా ?" అన్నట్టు రివ్వున ఆ గదిలోమఱి వుండకుండా మాయమైంది.

ఇంతకూ గులాబి రంగు ఎవరి సొత్తూ ? తల్లి సొత్తు. ఎవరికొస్తుంది ? కూతురి కొస్తుంది !

★


## ఆంధ్ర మహిళా సభ

### మైలాపూరు, మదరాసు

విద్యా శాఖ

కాశీ హిందూ విశ్వ విద్యాలయం ఎడ్మిషన్ పరీక్షకు ప్రిపరేటరీ క్లాసులు ఏప్రిలు 1వ తేదీని, 1946 సం॥ మార్చి పరీక్షకు తయారుచేయు క్లాసులు మే 1వ తేదీని ప్రారంభమౌతాయి. హాస్టలు సౌకర్యములుగలవు. వివరములకు కార్యదర్శిని పేర వ్రాయండి.